

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

ప్రతీ శనివారం గైనకాలజిస్ట్ కన్సల్టేషన్ ఉచితం

క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్ట్‌పై రాయితీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మెడికవర్ ఉమన్ - చైల్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షీ క్లినిక్ ద్వారా కార్పొరేట్ వర్కింగ్ ఉమన్, కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా ప్రతి శనివారం ఉచిత గైనకాలజిస్ట్ కన్సల్టేషన్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ క్లినిక్‌ను శనివారం హైటెక్ సిటీలో ప్రారంభించారు. క్లినిక్‌ను సందర్శించేవారికి క్యాన్సర్ స్ర్కీనింగ్ టెస్ట్‌పై 30 శాతం డిస్కౌంట్‌తో పాటు ఏడాదికి ఒకసారి కాంప్లిమెంటర్ హెల్త్ ప్యాకేజీ సదుపాయం అందిస్తున్నట్లు తెలిపాయి. కార్యక్రమంలో హ్యాష్‌ట్యాగ్ మార్కెటింగ్ వ్యవస్థాపకురాలు గుల్నార్ విర్క్ కృష్ణ, చీఫ్ లీగల్ కంప్లయిన్స్ ఆఫీసర్ ఇషా సిన్హా, మెడికవర్ ఆస్పత్రి చీఫ్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ మహేశ్ దెగ్లూర్కర్, డాక్టర్ రవీందర్ రెడ్డి పరిగే, సెంటర్ హెడ్ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్, కార్పొరేషన్‌కు చైర్మన్, పాలకమండళ్లను నియమించాలి

పంజాగుట్ట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులాల ఫెడరేషన్, కార్పొరేషన్లకు వెంటనే చైర్మన్‌లను నియమించి పాలకమండళ్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, సోషల్ మీడియా కన్వీనర్ దుర్గా ప్రసాద్‌లతో కలసి ఆయన మాట్లాడారు. బీసీ, ఎంబీసీ, ఫిషరీస్, ముదిరాజ్ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినందుకు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మిగితా కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు కూడా చైర్మన్, పాలక మండళ్లను వెంటనే నియమించాలని ఆయన కోరారు. సమావేశంలో సమితి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

బేగంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని పాటిగడ్డ ఎన్‌బీటీ నగర్‌లో ఇళ్ల మధ్య నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలు ఉండటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ తీగలకు ఫైబర్ కేబుళ్లను అమర్చారు. నాణ్యత కలిగిన కేబుళ్లను అమర్చడంతో వర్షం కురిసిన, పెను గాలులు వీచినా ఎలాంటి ప్రమాదాలు జరగవని డీఈ సుధీర్‌కుమార్ స్థానికులుకు వివరించారు. శనివారం ఏడీఈ కిశోర్‌కుమార్, ఏఈఈ మధుసూదన్‌రావుతో కలిసి ఎన్‌బీటీ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ తీగలకు ఏర్పాటు చేసిన కేబుళ్లను పరిశీలించి స్థానికులకు వీటిపై అవగాహన కల్పించారు.

అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన కారు


చెరువులోకి దూసుకెళ్లిన కారు

హైదర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కారును వెనక్కి తిప్పుతుండగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ నుంచి ప్రగతినగర్ వైపుగా వెళ్తున్న కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను కాపాడారు. స్థానికుల సహాయంతో కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కారులోకి పూర్తిగా నీరు వెళ్లడంతో కారు పాడయింది.

ఆకట్టుకుంటున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ


చీరలను పరిశీలిస్తున్న మహిళలు

బంజారాహిల్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా అన్ని ఉత్పత్తులను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమం ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో పేరిట వస్త్ర ప్రదర్శనను ప్రారంభించింది. ఇందులో అన్ని రకాల చీరలు, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన ఆగస్టు 5 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు శ్రీనివాస్ తెలిపారు.

మేడారం అడవిని రక్షించుకుందాం

పంజాగుట్ట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో మేడారంతో పాటు వివిధ ప్రాంతాల్లోని అడవులను సంరక్షించి అడవి ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి తెలియజెప్పడానికి 'వన దేవతలకు మాటిద్దాం.. మొక్క ముడుపు చెల్లిద్దాం' పేరుతో మొక్క ముడుపు పండుగను ప్రారంభిస్తున్నామని ప్లాంటేషన్ ఫెస్టివల్ నిర్వాహకుడు అనిల్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడారంలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా ఆ ప్రాంతంలో జీవ వైవిధ్యం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పెద్ద ఎత్తున పోగవుతుండడంతో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. మేడారం చుట్టుపక్కల పర్యావరణ విద్యకు, సుస్థిర వ్యవసాయనికి క్షేత్రాలుగా మల్చడానికి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. మేడారాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఇక్కడ మంచి స్పందన వస్తే నాగోబా, భద్రాచలం, శ్రీశైలం, ఆమ్రాబాద్ లో అటవీ ప్రాంతంలో జరిగే ఆదివాసీ, గిరిజన,చెంచుల ఉత్సవాలలో కూడా కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు.


శ్రీరామ్‌నగర్ బస్తీ అధ్యక్షులు, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ ఉమర్ అలీ శనివారం కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు సీఎన్‌రెడ్డి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. -యూసుఫ్‌గూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):


నకిలీ బంగారంతో బ్యాంకుకు టోకరా

యూసుఫ్‌గూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారంతో బ్యాంకులో రుణం తీసుకుని మోసానికి పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావు నగర్ కాలనీలోని ఈఎస్‌ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో వల్లూరి ప్రదీప్ చౌదరి అనే వ్యక్తి 2022 ఆగస్టు 5న తన రెండు ఉంగరాలు తాకట్టు పెట్టి రూ.1.18 లక్షలు రుణం తీసుకున్నాడు. సంవత్సరంలోపు బంగారం తీసుకోవడం, లేదా రెన్యూవల్ చేయడం చేయాల్సి ఉంది. కానీ అతను రాలేదు. దీంతో ప్రదీప్ చౌదరికి నోటీసు పంపారు. అయినా సమాధానం లేదు. దీంతో బ్యాంకు నిబంధనల ప్రకారం అతని ఉంగరాలు వేలం వేసేందుకు పరిశీలించగా అవి నకిలీవిగా బయటపడింది. ఆ వెంటనే ప్రదీప్ చౌదరీని సంప్రదించేందుకు బ్యాంక్ అధికారులు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. దీంతో నకిలీ బంగారంతో బ్యాంకులో రుణం తీసుకున్న ప్రదీప్ చౌదరిపై చర్యలు తీసుకోవాలని బ్యాంకు మేనేజర్ ఎన్. పురుషోత్తంరెడ్డి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పని ఎదురుచూపులు

పూర్తికాని ఎస్పీఆర్ హిల్స్ రిజర్వాయర్ నిర్మాణం

52 బస్తీల్లో తాగునీటికి కటకట ● అర్ధరాత్రి అరకొర నీటి సరఫరాతో ఇక్కట్లు ● పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


ఎస్పీఆర్ హిల్స్‌లో నిర్మాణంలోని రిజర్వాయర్

యూసుఫ్‌గూడ, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా రహ్మత్‌నగర్, బోరబండ పరిసర ప్రాంతాల్లోని 52 బస్తీల ప్రజల తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. ఆయా కాలనీల్లో అర్ధరాత్రి వేళ అరకొరగా నీటిని తక్కువ ప్రెషర్‌తో సరఫరా చేస్తుండటంతో బస్తీవాసులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ప్రాంత ప్రజల తాగు నీటి ఇబ్బందులు తొలగించేందుకు ఎస్పీఆర్ హిల్స్‌లో ఓ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. వాస్తవానికి అది గత వేసవికే పూర్తి కావాల్సి ఉన్నా, వర్షకాలం పూర్తవుతున్నా ఇంకా పనులు కొనసాగతూనే ఉన్నాయి. ఆ రిజర్వాయర్ ఎప్పటికి పూర్తవుతుందో తమ బాధలు ఎప్పటికి తీరుతాయోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

నాలుగు రోజులకోసారి మాత్రమే

శేరిలింగంపల్లి నుంచి గోదావరి జలాలు ఎస్‌ఆర్‌ఆర్‌పురం కాలనీ సైట్-2లోని ఎస్పీఆర్ హిల్స్ సెక్షన్ కార్యాలయంలోని 6 ఎంఎల్ (మిలియన్ లీటర్స్) సామర్థ్యం గల రిజర్వాయర్‌కు నీరు వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి ఎస్పీఆర్ హిల్స్‌లోని 1 ఎంఎల్ రిజర్వాయర్‌కు పంపింగ్ ద్వారా పంపిస్తున్నారు. ఈ నీరు దాదాపుగా 15 వేల ఇళ్లకు ఏ మాత్రం సరిపోవడం లేదు. గతంలో ఎస్పీఆర్ హిల్స్‌లో 1 ఎంఎల్ సామర్థ్యం గల రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశారు. అయితే 52 బస్తీలలో నివాసాలు పెరగడం, జనాభా కూడా గణనీయంగా పెరగడంతో ఆ రిజర్వాయర్ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో 3ఎంఎల్ సామర్థ్యంతో మరో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. గడచిన వేసవి కాలానికి దాన్ని అందుబాటులోకి తెస్తామని అధికారులు చెప్పినా నేటికి నిర్మాణ పనులు పూర్తికాని పరిస్థితి. దీంతో నాలుగు రోజులకు ఓ సారి అర్ధరాత్రి దాటిన తర్వాత చాలీచాలకుండా సరఫరా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మిగిలింది పైప్‌లైన్ పనులే

నిర్మాణంలోని 3 ఎంఎల్ రిజర్వాయర్ అందుబాటులోకి వస్తేనే నీటి కష్టాలు తీరనున్నాయి. అయితే రిజర్వాయర్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. నీటిని పంప్ చేసేందుకు రెండు 270 హెచ్‌పీ మోటార్లు ఏర్పాటు చేశారు. కానీ పంపింగ్ కేంద్రం నుంచి రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు మాత్రం మిగిలాయి. ఇంతలో వర్షాకాలం వచ్చింది. దీంతో వర్షాలు తగ్గాక పనుల పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఏళ్లుగా సమస్య తీరడం లేదు



ఏ సమయానికి నీరు వస్తుందో తెలియదు. అర్ధరాత్రి వేళ నీటికోసం ఎదురు చూడాల్సి వస్తోంది. నాలుగు రోజులకు ఒకసారి తక్కువ ప్రెషర్‌లో వస్తున్నాయి. దీంతో సరిపడా నీరు పట్టుకునే వీలు లేకుండా పోతోంది. ఏళ్లుగా సమస్య ఇలాగే ఉంది.

- రజినియాదయ్య, ఎస్పీఆర్ హిల్స్, కమలానగర్

త్వరగా పనులు పూర్తి చేయాలి



బస్తీలలో నీటి సమస్య చాలా తీవ్రంగా ఉంది. త్వరగా రిజర్వాయర్ పూర్తి అందుబాటులోకి తీసుకురావాలి. రాత్రి వేళ నీటికోసం ఎదురుచూడాల్సి వస్తోంది. అధికారులు ఇప్పటికైనా పనులు వేగవంతం చేసి రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.

- ఇమ్రయాజ్ ఖాన్, శ్రీరామ్‌నగర్

ఎన్‌ఐఎస్‌ఏయూ సహకారంతో యూకేలో విద్యావకాశాలు

గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకుడు ఆలపాటి శ్రీకర్



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఆలపాటి శ్రీకర్, పక్కన చైర్‌పర్సన్ సనమ్ అరోరా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యూకేలోని అత్యుత్తమ యూనివర్సిటీల్లో విద్యావకాశాలను భారతీయ విద్యార్థులకు చేరువ చేసేందుకు నెట్‌వర్క్ ఆఫ్ ఇండియన్ స్టూడెంట్స్ అండ్ అలూమ్ని-యూకే(ఎన్‌ఐఎస్‌ఏయూ) దోహదపడుతుందని ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ గ్లోబల్ ట్రీ వ్యవస్థాపకుడు ఆలపాటి శ్రీకర్ అన్నారు. నగరంలోని విల్లామేరీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సెషన్‌లో ఆయన మాట్లాడారు. విజయవంతమైన భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న విద్యార్థులకు ఈ ఈవెంట్ కీలకమైన గేట్‌వే కానుందన్నారు. విదేశాల్లో లభించే ఎడ్యుకేషన్, కెరీర్ అవకావాలు అందిపుచ్చుకునేందుకు చేయాల్సిన ప్రణాళికల గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. యూకేలోని ప్రముఖ యూనివర్సిటీల అవగాహన కల్పిస్తామన్నారు. ఎన్‌ఐఎస్‌ఏయూ చైర్‌పర్సన్ సనమ్ అరోరా మాట్లాడుతూ.. విద్యా, ఉపాధి వనరులను, నైపుణ్య సంపదను ఒకచోట చేర్చడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇన్స్పైరేటివ్ సెషన్‌లు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు, పరిశ్రమ నిపుణులతో ఇంటరాక్షన్, వీసా ప్రక్రియలు, కెరీర్ అవకాశాలకు సంబంధించిన సందేహాలకు ఎన్‌ఐఎస్‌ఏయూ మంచి వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ స్కిల్ ఎంగేజ్‌మెంట్ మేనేజర్ డగ్లస్ థామ్సన్, విల్లామేరీ కళాశాల ప్రిన్సిపాల్ రేవతి మాథుర్, హేర్నర్ ఆడమ్స్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగాధిపతి పర్మజిత్ చిమా తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పక్కన సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత యాదవ్, తదితరలు - బేగంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) :

బీఆర్‌ఎస్ నాయకుడికి తలసాని పరామర్శ


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తలసాని

అమీర్‌పేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, బల్కంపేట బీజేఆర్‌నగర్‌కు చెందిన ఆర్య సమాజ్ నిర్వాహకున్ని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుడు నరేందర్ రెడ్డి, రవికిరణ్ మాతృమూర్తి ధనమ్మ శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శనివారం వారి నివాసాలకు వెళ్లి పార్థీవదేహాలపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, డివిజన్ అధ్యక్షులు హన్మంతరావు, అశోక్ యాదవ్, సంతోష్, నర్సింహ, వనం శ్రీనివాస్, గోపిలాల్ చౌహాన్ తదితరులు ఉన్నారు.

ప్రతీ దరఖాస్తును ఇన్‌వార్డు రిజిస్టర్‌లో నమోదు చేయాలి : కలెక్టర్ అనుదీప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ప్రతీ దరఖాస్తును ఇన్‌వార్డు రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. మీ సేవా డాష్‌బోర్డులో ఫైళ్లను పెండింగ్ లేకుండా చూడాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన సేవా కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భవనాలు, భూములను గుర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, ఆర్డీఓలు మహిపాల్, దశరథ్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ టీం కెప్టెన్లుగా ధీరజ్, మెరిన్


క్రీడాకారులతో త్రోబాల్ సంఘం ప్రతినిధులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర సీనియర్ త్రోబాల్ పురుషుల జట్టు కెప్టెన్‌గా ధీరజ్, మహిళల జట్టు సారథిగా మెరిన్ నియమితులయ్యారు. బెంగుళూరులో ఆదివారం నుంచి జరగనున్న ఈ పోటీల్లో పాల్గొననున్న తెలంగాణ జట్లకు ఆ సంఘం అధ్యక్షుడు నవీన్ యాదవ్ వ్యక్తిగత కిట్లను యూసుఫ్‌గూడలోని తన కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక కార్యదర్శి పి.జగన్‌మోహన్ గౌడ్ పాల్గొన్నారు. పురుషుల జట్టులో ధీరజ్, లోకేష్, యువన్, బద్రినాథ్, ప్రణీత్, తరుణ్, కార్తీక్, బాలాజీ, నితిన్, లితిన్, అభిజిత్, నాగరాజు, విష్ణు, భార్గవ్, మహిళల జట్టులో మెరిన్, మావిష్, సజియ, ఆయేషా, స్రిద్ధా, స్నేహ, సాహితి, అక్షయ, సింధూరి, జాహ్నవి, హారిక, స్నిగ్ధా, ఎస్తేర్, లావణ్య, సహస్రాకు చోటు లభించింది.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంతీర్పు హర్షణీయం

యూసుఫ్‌గూడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనర్సింహనగర్ మాదిగ బలగం సంబురాలు నిర్వహించారు. శనివారం యూసుఫ్‌గూడ బస్తీ చౌరస్తాలో అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఆనందంతో మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో ప్రకాశ్ మాదిగ, రామారావు, నర్సింగరావు, నర్సింగ్‌దాస్, సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 46ను వెంటనే సవరించాలి


నిరసనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): జీవో నంబరు 46ను సవరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయం ఎదుట కానిస్టేబుల్ అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. అక్కడ బైఠాయించిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం ప్రజాభవన్ వద్ద వారు బైఠాయించగా అర్ధరాత్రి అనంతరం 1.30కి పోలీసులు అరెస్టు చేశారు. విడుదలైన అనంతరం వెంటనే సచివాలయం ఎదురుగా ఉన్న లుంబినీ పార్కు ఎదుట బైఠాయించడంతో మరోసారి వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ 2022లో 5,010 తెలంగాణ స్పెషల్ పోలీసుల కోసం నోటిఫికేషన్ విడుదల కాగా రాష్ట్ర స్థాయి పోస్టులను జిల్లాల వారీగా వేరు చేయడంతో గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వం జీవో 46ను సవరించి బ్యాక్‌లాగ్ పోస్టులను చేర్చి మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై కమిటీ వేసి ఎనిమిది నెలలు గడచినా ఏం జరగలేదని వాపోయారు.

ఈబీ5 వీసాతో సులువుగా గ్రీన్‌కార్డు పొందొచ్చు

పంజాగుట్ట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని ఫెడరల్ గవర్నమెంట్ ప్రవేశపెట్టిన కొన్ని ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావడం ద్వారా ఈబీ5 వీసా సులువుగానే లభిస్తుందని అమెరికాలో రియల్ ఎస్టేట్ రంగ నిపుణుడు కిరణ్ వేదాంతం, మల్లెల గ్లోబల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మల్లెల ఆదిత్య తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎంతోమంది భారతీయులు తమ విలువైన భవిష్యత్తు కొరకు అమెరికాలో స్థిరపడాలని కోరుకుంటారని, అలాంటి వారికోసం ఈబీ5 వీసా ఎంతో అనువుగా ఉంటుందన్నారు. ఈ వీసా ద్వారా అమెరికాలో వర్క్ పర్మిట్, నిబంధనలతో కూడిన గ్రీన్ కార్డు పొంది, తదుపరి ఐదేళ్లలోగా శాశ్వత గ్రీన్ కార్డును సొంతం చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో ఈబీ5 గ్రీన్‌కార్డు కన్సల్టెంట్ వైభవ్, అభినవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖైరతాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద విడుదలైన చెక్కులను శనివారం ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి అందజేశారు. బంజారాహిల్స్‌కు చెందిన చరణ్‌కు చెయ్యి విరగడంతో సర్జరీ, దేవరకొండ బస్తీకి చెందిన మహమ్మద్ నిసార్ గుండెకు పేస్ మేకర్ వేయాల్సి వచ్చింది. వీరిద్దరికీ చెరో రూ.60 వేల విలువైన చెక్కులను ఆమె అందజేశారు.

ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలు అభ్యంతరకరం


కాట్రగడ్డ ప్రసూన, మాజీ ఎమ్మెల్యే

అమీర్‌పేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, నీ అమ్మ అనే పదం ఉచ్చరించడం స్త్రీ జాతికి అవమానకరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుల పట్ల ఇలా దురుసుగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వెల్లడించారు. చట్ట సభలకు ప్రజాప్రతినిధులుగా ప్రజలు ఎన్నుకున్నది సుస్థిర పాలన అందించాలని, కానీ నోటికి వచ్చినట్లు మాట్లాడడానికి కాదన్నారు. ప్రజలు గమనిస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలు గుర్తించాలని హితవు పలికారు.

ఏపీ మంత్రిని కలిసిన టీ టీడీపీ నేతలు


మంత్రి సవితకు స్వీట్ బాక్స్ అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

అమీర్‌పేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సవితను తెలంగాణ టీటీడీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేంద్రప్రసాద్ శనివారం విజయవాడలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దంపతులకు శాలువాలు కప్పి సన్మానించి స్వీట్స్ అందజేశారు. పెనుగొండ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించడం, ఆపై మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల అమీర్‌పేట డివిజన్‌కు చెందిన టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాలి

బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ బోధనలో భారతీయ ప్రమాణాలను మిళితం చేయాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో స్టాండర్డ్స్ క్లబ్స్‌గా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులకు 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే అంశంపై బీఐఎస్ రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా 10 వేలు, తెలంగాణలో 190 పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విదార్థులకు విభిన్న పోటీల్లో భాగస్వామ్యం చేయడం, భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమల సందర్శనకు తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే కొత్త కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలకు బీఐఎస్ రూపొందించిన పుస్తకాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు రాకేష్, కెవిన్, ఏఎన్ఎస్పీ శాస్త్రీలు పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

లింక్ ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరో కొత్తరకం మోసానికి తెరతీశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారులను లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ పేరుతో ఒక నకిలీ మెసేజ్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. 'ప్రియమైన వినియోగదారులారా..! మీ ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు (9980.00) గడువు నేటితో ముగుస్తుంది. వెంటనే ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది.' అంటూ నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వచ్చిన మెసేజ్ నిజమని నమ్మి లింక్‌ను ఓపెన్ చేసి ఎస్‌బీఐ రివార్డు యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వెంటనే 'మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు. దాంతో మీ ఫోన్ కంట్రోలింగ్ వారి చేతికి వెళ్తుంది. ఫోన్‌లో మీరు ఎస్‌బీఐ ఖాతా వివరాలు నమోదు చేయగానే వారు ఖాతాలో ఉన్న డబ్బు ఖాళీ చేస్తారు' అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారులు ఈ మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మొద్దని, ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఫోన్‌లో ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అద్దెకుంటున్న ఇంట్లో చోరీ

- పోలీసులకు చిక్కిన మహిళ
- 20 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు


నిందితులు జ్యోతి, చైతన్య కుమార్

నిజాంపేట్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తనకున్న అప్పు తీర్చుకొని సంతోషంగా జీవించాలని అనుకున్న ఓ మహిళ ఆమె అద్దెకుంటున్న ఓనర్ ఇంటికే కన్నం వేసింది. బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని జర్నలిస్టుకాలనీలో నివాసం ఉండే బడుగు జ్యోతి (27) తాను అద్దెకు ఉంటున్న యజమాని భార్యతో సన్నిహితంగా ఉండేది. ఈ క్రమంలో ఆ ఇంటి తాళంచెవులను డూప్లికేట్ చేయించి తన వద్ద దాచుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తనకు మరిది వరుసయ్యే ఇంద్రమ్మకాలనీలో ఉండే జంపని చైతన్యకుమార్ (22)తో కలిసి బంగారు నగలు, నగదు చోరీ చేశారు. అయితే ఇంటి యజమానులు వచ్చి చూసేసరికి ఇంటి తాళం వేసింది వేసినట్టే ఉంది. కానీ బీరువాలో దాచిన నగలు, రూ.90వేల నగదు మాయంకావడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సీఐ ఉపేందర్‌రావు ఆదేశాల మేరకు డీఐ తిమప్ప ప్రత్యేక టీంతో బంగారు దుకాణాల వద్ద నిఘా పెట్టించారు. ఈక్రమంలో శనివారం ప్రగతినగర్‌లో బ్యాగు చేతిలో పట్టుకొని అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకొని చూడగా అందులో బంగారు ఆభరణాలు కనిపించాయి. పోలీసులు వారి నుంచి రూ.14లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితురాలు రెండేళ్లుగా అదే ఇంట్లో అద్దెకు ఉంటూ వారి కదలికలను గమనిస్తూ చోరీకి పాల్పడిందని పోలీసులు తెలిపారు.

లింక్ ఓపెన్ చేస్తే ఖాతా ఖాళీ

- ఎస్‌బీఐ ఖాతాదారులకు రివార్డు పాయింట్ల పేరుతో నకిలీ మెసేజ్‌లు
- సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు మరో కొత్త రకం మోసానికి తెరతీశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఖాతాదారులను లక్ష్యంగా చేసుకున్న కేటుగాళ్లు ఎస్‌బీఐ రివార్డు పాయింట్స్ పేరుతో ఒక నకిలీ మెసేజ్‌ను సర్క్యులేట్ చేస్తున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు పేర్కొన్నారు. "ప్రియమైన వినియోగదారులారా..! మీ ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్ రివార్డు పాయింట్లు (9980.00) గడువు నేటితో ముగుస్తుంది. వెంటనే ఎస్‌బీఐ రివార్డు యాప్ ఇన్‌స్టాల్ ద్వారా రిడీమ్ చేసుకోండి. నేరుగా మీ ఖాతాలో నగదు డిపాజిట్ అవుతుంది." అంటూ నకిలీ మెసేజ్‌లు పంపిస్తున్నారు. వచ్చిన మెసేజ్ నిజమని నమ్మి లింక్‌ను ఓపెన్ చేసి ఎస్‌బీఐ రివార్డు యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే వెంటనే 'మీ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారు. దాంతో మీ ఫోన్ కంట్రోలింగ్ వారి చేతికి వెళ్తుంది. ఫోన్‌లో మీరు ఎస్‌బీఐ ఖాతా వివరాలు నమోదు చేయగానే వారు ఖాతాలో ఉన్న డబ్బు ఖాళీ చేస్తారు' అని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. ఎస్‌బీఐ ఖాతాదారులు మోసపూరితమైన మెసేజ్‌లు నమ్మొద్దని, ఎలాంటి యాప్‌లు, లింక్‌లు ఫోన్‌లో ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు


చెరువులో కారు

హైదర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కారును వెనక్కి తిప్పుతుండగా అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన ఘటన హైదర్‌నగర్ డివిజన్ అంబీర్ చెరువు వద్ద శనివారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ నుంచి ప్రగతినగర్ వైపుగా వెళ్తున్న కారు చెరువు ప్రారంభంలో టర్న్ చేసుకునే క్రమంలో అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులను కాపాడారు. స్థానికుల సహాయంతో యజమాని కారును బయటకు తీశారు. కారు ముందుభాగం పాక్షికంగా దెబ్బతినడంతో పాటు కారులోకి పూర్తిగా నీరు వెళ్లడంతో కారు పాడయింది.

పని కోసమని వెళ్లిన వ్యక్తి అదృశ్యం

అడ్డగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పనికోసమని బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శంకర్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌లో ఉంటున్న రాజు గత నెల 27న ఉదయం పనికోసమని వెళ్లి ఆరోజు రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో భార్య సంధ్య వెంటనే అదే రోజు తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముందస్తుగా పోలీసులు డీడీ ఎంట్రీ చేసి మిస్సింగ్ కేసి కింద నమోదు చేశారు. అనంతరం ఇతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబరాబాద్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

- శుక్రవారం పట్టుబడ్డ 309 మంది

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో 309 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో 261 మంది ద్విచక్రవాహనదారులు, 11 మంది ఆటోడ్రైవర్లు, 36 మంది కార్లు నడిపేవారు. ఒక భారీ వాహన డ్రైవర్ ఉన్నారు. మాదాపూర్‌లో 17 మంది, రాయదుర్గంలో 13 మంది, గచ్చిబౌలిలో ఆరుగురు, నార్సింగ్‌లో 13 మంది, రాజేంద్రగర్‌లో 35మంది, శంషాబాద్‌లో 20మంది, చేవెళ్లలో 18 మంది, షాద్‌నగర్‌లో 10 మంది, మియాపూర్‌లో 52 మంది, కూకట్‌పల్లిలో 13 మంది, బాలానగర్‌లో 21 మంది, జీడిమెట్లలో 16 మంది, అల్వాల్‌లో 22 మంది, కేపీహెచ్‌బీలో 8 మంది, మేడ్చల్‌లో 17 మంది, ఆర్‌సీపురంలో 28 మంది డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారు.

నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత

రూ.65వేల విలువ చేసే 30డిఫెన్స్ బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎక్సైయిజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కరును అమ్మకాలు జరపవద్దంటూ అనేకమార్లు హెచ్చరికలు చేసి, కేసులు నమోదు చేస్తున్నప్పటికీ కొందరు అక్రమార్కులు అధిక లాభాల కోసం అమ్మకాలు చేపట్టి ఎక్సైజ్ శాఖకు నష్టాలు చేకూర్చే పనులు చేస్తున్నారు. ఎన్‌డీపీఎల్ (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్)పై ఎక్సైజ్ శాఖ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి దాడులు నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని స్నేహ చికెన్ సెంటర్ సమీపంలో డిఫెన్స్‌కు సంబంధించిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కరును పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకొని కృష్ణారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పోలీసులకు అప్పగించారు. పట్టుకున్న ఈ మద్యం విలువ రూ.65వేలు ఉంటుందని అంచనా వేశారు. ఈ బాటిళ్లను స్వాధీనం చేసుకున్న బృందంలో డీఎస్పీ తిరుపతి యాదవ్, ఎస్సై జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ అన్వర్, రాజేశ్వర్, కాశీరావు విజయేందర్ రెడ్డి ఉన్నారు. ఎన్‌డీపీఎల్ మద్యాన్ని పట్టుకున్న ఎక్సైజ్ అధికారులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

చిలకలగూడలో హిట్ అండ్ రన్ కేసు

బౌద్ధనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 8.30గంటల ప్రాంతంలో గాంధీ ఆస్పత్రి పరిసరాల్లో భిక్షాటన చేసుకునే యువకుడి(30)ని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మరణించాడు. ఢీకొట్టిన వాహనం ఆచూకీ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు చిలకలగూడ పోలీసులు తెలిపారు. మృతుడు భిక్షగాడు కావటంతో వివరాలు తెలియలేదని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి మార్చురీకి తరలించినట్లు పోలీసులుతెలిపారు.


దండు మారమ్మ ఆలయం


డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయం


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

నేడు దండుమారమ్మ బోనాల జాతర

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సికింద్రాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు జంటనగరాలలో ప్రసిద్ధి చెందిన బాలంరాయి దండు మారమ్మ బోనాల జాతర ఆదివారం జరగనుంది. వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బాలంరాయి దండుమారమ్మ బోనాల జాతర ప్రతి ఏడాది కనులపండువగా నిర్వహిస్తారు. లష్కర్‌లోని ప్రముఖ అమ్మవారి దేవాలయాల్లో ఒకటైన దండు మారమ్మ ఆలయానికి కంటోన్మెంట్‌తో పాటు జంటనగరాలు, శివార్ల నుంచి భక్తులు అశేష సంఖ్యలో తరలివస్తుంటారు. తెల్లవారుజామునే మహిళలు నెత్తిన బోనాలతో తరలివస్తారు. అమ్మవారికి భక్తి శ్రద్ధలతో బోనం సమర్పించి తమకు అంతా శుభం చేకూర్చాలంటూ మొక్కులు తీర్చుకుంటారు. ప్రజాప్రతినిధులు, అధికార అనధికార ప్రముఖులు సైతం ప్రతి ఏడాది బోనాల జాతరను పురస్కరించుకుని దండుమారమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ఈ ఏడాది దండుమారమ్మ ఆలయంతోపాటు కంటోన్మెంట్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా బోనాల జాతరను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు స్థానిక కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్ తెలిపారు. ఇదిలా ఉండగా ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా టీకాంగ్రెస్ కార్యదర్శి బి.ఎ. ప్రమోద్‌కుమార్, ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఫలహార బండి ఊరేగింపును కనులపండువగా నిర్వహించడానికి సన్నాహాలు పూర్తిచేశారు. భక్తజన మండళ్లు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఫలహార బండ్లు, తొట్టెల ఊరేగింపు జరగనుంది. పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.


ఫలహార బండి ఊరేగింపులో కాంగ్రెస్ సీనియర్ నేత హనుమంతరావు తదితరులు (ఫైల్)

నేడు బొల్లారంలో

తిరుమలగిరి : ఆషాఢ మాసం బోనాల జాతరలో భాగంగా ఆదివారం మూడోవారం సందర్భంగా బొల్లారంలోని డౌటన్ బజార్ భూలక్ష్మమ్మ దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతోపాటు అమ్మవారి రూపం ప్రతిబింబించేలా పూలతో దేవాలయాన్ని అలంకరించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన లాంటి ప్రత్యేక పూజలు చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అమ్మవారి దేవాలయానికి పూల అలంకరణ చేశారు. అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు.


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

మత్తుకు బానిస కావొద్దు : ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుకు బానిసకావొద్దని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. డ్రగ్స్‌ను నిర్మూలించడానికి తిరుమలగిరి పోలీసులు లాల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభం చేసి బాలికలకు మత్తుపట్ల అవగాహన కల్పించారు. దీంతో పాటు సైబర్ నేరాలపై కూడా అవగాహన కల్పించారు. డ్రగ్స్ వంటి మహమ్మారిని తరిమికొట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ నాగరాజు, హైదరాబాద్ నాగరిక సురక్ష అధ్యక్షులు సునీత తదితరులు పాల్గొన్నారు.

అన్ని పండుగలను కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుంది

మారేడుపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శనివారం పికెట్ విజయనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో కంటోన్మెంట్‌లోని కొత్త దేవాలయాలకు ప్రభుత్వం నుంచి నూతనంగా మంజూరైన చెక్కులను ఆలయాల నిర్వాహక కమిటీ ప్రతినిధులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వ్యక్తిత్వ శిక్షణా తరగతులు

హరిహరకళాభవన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): యువత ఏకాగ్రతతో లక్ష్యం నిర్ణయించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ పేర్కొన్నారు. సికింద్రాబాద్, హరిహర కళాభవన్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకి నిర్వహిస్తున్న ఉచిత వ్యక్తిత్వ శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన నైనా జైస్వాల్ ప్రసంగిస్తు ఏరంగంలోనైనా రాణించాలంటే ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరమని, విద్యార్థులు చిన్నతనం నుంచే లక్ష్యం ఏర్పరుచుకుని సాధించే వరకు పోరాటపటిమతో విజయం సాధించాలని సూచించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ జాతీయ అధ్యక్షుడు గంపా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 27సంవత్సరాలుగా నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా తమ ప్రతినిధులు విద్యనందిస్తున్నారని వివరించారు. నగరంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన నిరుద్యోగులు, విద్యార్థులతో కళాభవన్ కిటకిటలాడింది.


చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు

పేదలకు నిరంతర సేవలు

- ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో పేద ప్రజలకు నిరంతర సేవలందిస్తామని స్థానిక శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. శనివారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో ఐదు డివిజన్లకు చెందిన సుమారు 155మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల వైద్యానికి ఉపకరించేలా ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని ఉపయోగించుకుంటామన్నారు. అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లకు చెందిన సుమారు 155మంది లబ్ధిదారులకు 56లక్షల రూపాయల విలువ చేసే చెక్కులను అందజేశామన్నారు. చెక్కులు పొందిన లబ్ధిదారులు లంచాలు చెల్లించరాదని, ఎవరైనా డబ్బులు అడిగితే తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, యువనాయకుడు ఆలకుంట హరి, జి.చంద్రశేఖర్, రాజు సుందరం, సునీల్‌ముదిరాజ్, శైలేందర్, బిల్డర్ నవీన్, బెజ్జంకి రాజేష్, అశ్విన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

పద్మారావునగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలను చేరవచ్చని, విద్యనే అభివృద్ధికి మూలమని స్ప్రింట్ సంస్థ డైరెక్టర్ స్ఫూర్తి అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం టాలెంట్ స్ప్రింట్ సంస్థ డైరెక్టర్ స్ఫూర్తి ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఎల్‌కేజీ నుంచి ఏడవ తరగతి విద్యార్థులకు టై, బెల్ట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కష్టపడి చదువుతూ అధ్యాపకులను, పెద్దలను గౌరవించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప స్ఫూర్తికి విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున రెడ్డి, మహేశ్, సునీత, నిత్య, రైసా, ఫర్హాన పాల్గొన్నారు.


జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోనాల పండుగకు ఏర్పాట్లుచేయండి

పద్మారావునగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా బోనాల జాతరను పురస్కరించుకొని బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలో నిర్వహించే బోనాల పండుగ సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ బస్తీవాసులు మాజీ మంత్రి, సనత్‌నగర్ శాసన సభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలసి విన్నవించారు. దానికి స్పందించిన తలసాని సంబంధిత అధికారులకు బోనాలు జరిగే ప్రాంతాలలో లైటింగ్, శానిటేషన్, రోడ్డు ప్యాచ్‌వర్క్, మట్టి కుప్పల తొలగింపు, చెట్ల కొమ్మల తొలగింపు వంటి చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశాలు జారీ చేస్తూ లెటర్‌ను వారికి అందజేశారు. ఈనెల 11, 12 తేదీలలో డివిజన్‌లోని ఐడీహెచ్ కాలనీ, రైల్ కళారంగ్ బస్తీ, జైనగర్ కాలనీ, సున్నంభట్టి, న్యూబోయగూడ, సీసీనగర్, బీజేఆర్‌నగర్, గొల్ల కొమురయ్య కాలనీలలో స్థానిక ప్రజలు బోనాలు నిర్వహిస్తారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్.వెంకటేశన్ రాజు, కొత్తూరు వెంకటేశ్, మహేందర్‌గౌడ్, ముక్కా శ్రీను, హరిచారితో జోనల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

మరిన్ని బస్సులు నడపాలి

- సీపీఎం జోన్ కార్యదర్శి అజయ్‌బాబు

మారేడుపల్లి. ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ అదే స్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన జరగడం లేదని సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఎం.అజయ్ బాబు విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆర్టీసీ బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలని, మెట్రో రైలు బోగీలను మూడు నుంచి ఆరుకు పెంచాలని, ఎంఎంటిఎస్ లోకల్ రైళ్లను పెంచాలని, డిమాండ్ చేస్తూ మారేడుపల్లి పాలిటెక్నిక్ బస్టాప్ వద్ద కరపత్రాలను పంచుతూ సంతకాల సేకరణ నిర్వహించారు. ప్రజా ఆందోళన కార్యక్రంలో భాగంగా ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ఏడవ తేదీ వరకు సంతకాల సేకరణ కరపత్రాల పంపిణీ ద్వారా సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వానికి ప్రజల సమస్యలు తెలియజేస్తామని అజయ్ బాబు పేర్కొన్నారు. ఈ ఆందోళనలో కార్యక్రమంలో ఆర్.మల్లేష్, ఎం.గోపాల్, ఏ.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పికెట్ డిస్పెన్సరీలో వైద్యసేవలు పొందాలి

- డాక్టర్ విశాల్ రాజ్

మారేడుపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రతి ఒక్కరూ కాలనీ, బస్తీలలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్య శిబిరాలను ఉపయోగించుకోవాలని కంటోన్మెంట్ పికెట్ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.విశాల్ రాజ్ కోరారు. డీఎంహెచ్ఓ వైద్య అధికారి వెంకట్ ఆదేశాల మేరకు ఎస్పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీ పర్యవేక్షణలో శనివారం పికెట్ గాంధీ హట్స్ బస్తీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ డాక్టర్ ఎం.విశాల్‌రాజ్ జ్వరం, బీపీ. షుగర్, డేంగ్యూ, చికెన్ గున్యాను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అక్కడే ఉచితంగా మందులను ఆయన పంపిణీచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్ రాజ్ మాట్లాడుతూ.... వర్షాల కారణంగా వాతావరణ మార్పులతో రోగ నిరోధక శక్తిని తట్టుకోలేని వారు అనారోగ్యాలకు గురిఅవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా మన పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో దోమలు లేకుండా చూసుకోవాలని, దోమ కాటుకు గురికాకుండా ఇళ్లలో తగిన జాగ్రత్త పాటించాలని సూచించారు. పికెట్ డిస్పెన్సరీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 9 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ మెదడు వ్యాధి రాకుండా నివారించేందుకు మొదట డోస్ మెదడు వ్యాధి రాకుండా జపనీస్ ఇన్‌కెఫ్‌లైటీస్ (జేఈ) వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, అవసరమైన వారు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. రెండవ డోస్ వ్యాక్సిన్ 16 నెలల తర్వాత ఇస్తారని తెలిపారు. పికెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు 9 గంటల నుంచి 4 గంటల వరకు పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలి

- బీఐఎస్ హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్


బీఐఎస్ సైన్స్‌బోధన శిక్షణలో ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సైన్స్ బోధనలో భారతీయ ప్రమాణాలను మిళితం చేయాలని, తద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంపొందించాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హైదరాబాద్ శాఖాధిపతి పీవీ శ్రీకాంత్ సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో స్టాండర్డ్స్ క్లబ్స్‌గా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాల సైన్స్ ఉపాధ్యాయులకు 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే అంశంపై బీఐఎస్ రెండు రోజుల పాటు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో శిక్షణ ఇచ్చింది. ఈ సందర్భంగా పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు దేశవ్యాప్తంగా 10 వేలు, తెలంగాణలో 190 పాఠశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ క్లబ్ ద్వారా విదార్థులకు విభిన్న పోటీల్లో భాగస్వామ్యం చేయడం, భారతీయ ప్రమాణాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమల సందర్శనకు తీసుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 'ప్రమాణాలతో సైన్స్ బోధన' అనే కొత్త కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ ఉపాధ్యాయులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలకు బీఐఎస్ రూపొందించిన పుస్తకాలను అందిస్తున్నామని ఆయన తెలిపారు. బీఐఎస్ శాస్త్రవేత్తలు రాకేష్, కెవిన్, ఏఎస్‌ఎస్పీ శాస్త్రీలు పలు అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

పురాతత్వ సంపదను వెలికితీసేందుకు..

మరిన్ని పరిశోధనలు అవసరం

- తెలంగాణ రాష్ట్ర బాషా, సాంస్కృతిక శాఖల డైరెక్టర్ మామిడి హరికృష్ణ


సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖల డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు

తార్నాక, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పురాతత్వ సంపదను వెలికితీసేందుకు శాస్త్రవేత్తలు మరిన్ని పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖల డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. అనిసెంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆర్కియాలజీ ఏ కన్వర్జేన్స్ ఆఫ్ మల్టీ ఇంటర్‌ట్రాన్స్ డిసిప్లినరీ అప్రోచెస్ అనే అంశంపై శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ఒక రోజు సదస్సును నిర్వహించారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ దేశంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న శిల్ప సంపద, శాసనాలపై మరిన్ని పరిశోధనలు చేసి వెలికితీయాలని సూచించారు. మన పురాతనకాల సంస్కృతి, విజ్ఞానాన్ని తెలుసుకోవడానికి పురాతత్వ శాస్త్రం దోహదపడుతుందన్నారు. అనంతరం ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆర్కియాలజీ పరిశోధనల ద్వారా విజ్ఞానాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆధునిక నాగరికత పరిణామ క్రమం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు విజ్ఞాన వ్యాప్తిలో పరిశోధనలు కీలక పాత్ర పోషించాయన్నారు. ఓయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొ.కిషన్ రావు, ప్రొ.విజయ్ కుమార్, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ తలత్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ డా.బీసవేణి రామ్ షపర్డ్, సెమినార్ డైరెక్టర్ ప్రొ.బి.లావణ్య. కన్వీనర్ డా.యాలాల శివానంద్, ఓయూ ఎగ్జామ్ కంట్రోలర్ ప్రొ.రాములు, డా.రామలింగం, డా.సతీష్, డా. రమేష్, సి.హెచ్. పరంధాములు పాల్గొన్నారు.